బడి గంట మోగింది!

- వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునః ప్రారంభం
- తొలిరోజు హాజరు శాతం అంతంతే..
- విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాల అందజేత


పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులు

మన్సూరాబాద్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం పున:ప్రారంభమయ్యాయి. తొలి రోజు విద్యార్థుల హాజరు శాతం అంతంతగానే ఉంది. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు అందజేశారు. పలు పాఠశాలల్లో స్వీపర్లు లేక విద్యార్థులు తరగతి గదులను శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రతీ పాఠశాలకు అటెండర్, స్వీపర్, నైట్‌వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. పలు పాఠశాలల్లో టాయిలెట్స్ కంపుకొడుతుండటంతో విద్యార్థులు టాయిలెట్స్‌కు వెళ్లలేని పరిస్థితి ఉంది. ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

◆ లింగోజిగూడ డివిజన్ పరిధి సరూర్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 974 మంది విద్యార్థులకు గాను తొలిరోజు 150 మంది హాజరయ్యారు. ఇక్కడ ఉపాధ్యాయుల కొరత లేదు.

◆ మన్సూరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 278 మంది విద్యార్థులకు గాను 96 మంది తొలిరోజు పాఠశాలకు వచ్చారు. ప్రస్తుతానికి ఈ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేదు. రెండు నెలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ప్రమోషన్‌పై వెళ్లనున్నారు.

◆ రాజీవ్‌గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థులకు గాను తొలి రోజు 60 మంది హాజరయ్యారు. పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్ పోస్టు ఖాళీగా ఉంది. పాఠశాలకు ఆటస్థలం లేదు.


సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


ప్రతిజ్ఞ చేస్తున్న రాజీవ్‌గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై చర్యలు


ఈస్ట్‌జోన్ మలక్‌పేట ఆర్టీఓ పరిధిలో స్కూల్ బస్సుల పత్రాలు తనిఖీ చేస్తున్న అధికారులు

నాగోలు: రోడ్డు భద్రతా నిబంధనలను పాటించకుండా పాఠశాల, కాలేజీ విద్యార్థులను బస్సుల్లో తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నాగోలు ఆర్టీఓ పి. రవీందర్‌కుమార్ ప్రైవేట్ విద్యాసంస్థలను హెచ్చరించారు. బుధవారం పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేష్ ఆదేశాల మేరకు ఎల్‌బీనగర్, నాగోలు పరిధిలోని స్కూలు, కాలేజీల బస్సులను తనిఖీ చేశారు. బస్సుల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, టాక్సీలకు సంబంధించిన పలు ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా విద్యార్థులను తరలిస్తున్న 18 స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు ఆర్టీఓ రవీందర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 ఏళ్లు దాటిన ఏ బస్సును రోడ్డుపై నడపవద్దని, ఎవరైనా నడిపితే బస్సును సీజ్ చేయడంతో పాటు సదరు విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యవంతులై 60 ఏళ్ల లోపు వయసు ఉన్న వారిని మాత్రమే డ్రైవర్లుగా నియమించుకోవాలని సూచించారు. డ్రైవర్లు మద్యం తాగి బస్సును నడపడం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడం వంటివి చేయరాదని అన్నారు. వాహన తనిఖీల్లో ఎంవీఐలు కె. రవీందర్ రెడ్డి , కె.అమర్‌నాథ్, ఎం.అనిత తదితరులు పాల్గొన్నారు.

నాలుగు బస్సులపై కేసు..

మలక్‌పేట: స్కూల్ బస్సులు నడిపేవారు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఈస్ట్‌జోన్ మలక్‌పేట ఆర్టీఓ లెక్కల కిష్టయ్య అన్నారు. బుధవారం పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఈస్ట్‌జోన్ ఆర్టీఓ ఆధ్వర్యంలోని పలు ప్రాంతాల్లో స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ లేని 3 బస్సులు, ట్యాక్స్ చెల్లించని ఒక బస్సు.. మొత్తం 4 బస్సులపై కేసులు నమోదు చేశామని ఆర్టీఓ తెలిపారు. తనిఖీల్లో ఎంవీఐలు బలరాం, రాధిక, నరేందర్ పాల్ సింగ్, ఏఎంవీఐ రజిని, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

మన్సూరాబాద్: సమతా ఆధ్యాత్మిక మూర్తి అన్నమయ్య జయంతి సందర్భంగా ఈ నెల 19న నగరంలోని బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ×ద్వేషం, అసమానత్వాలకు వ్యతిరేకంగా హిందూమతం× అనే అంశంపై సమ్మేళనం నిర్వహిస్తున్నారు. అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎల్‌బీనగర్‌లోని ఖాదిజ్ఞానీ ఆశ్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి, విజయవిహారం సంపాదకులు రమణమూర్తి, త్రినాథ్ స్వామి దాస్ హాజరయ్యారు. శ్రీమాత నిశ్చలాంబ (నారాయణమ్మ), ఆచార్య అంబికేశ చైతన్య, స్వామి అమృతానందగిరి, సాధు త్రినాథదాస్, బీవీరెడ్డి ఖాదిజ్ఞానీ, రజనీ ఖాదిజ్ఞానీ, రాజు ఖాదిజ్ఞానీ పాల్గొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్‌లో గ్రామీణ యువతను ప్రోత్సహించాలి


స్కాలర్‌షిప్ చెక్కును అందజేస్తున్న బిగ్‌బాస్-7 ఫేమ్ రతిక

చైతన్యపురి: ఫ్యాషన్ డిజైనింగ్‌లో గ్రామీణ యువతను ప్రోత్సహించాలని బిగ్‌బాస్-7 ఫేమ్ రతిక రవీందర్ అన్నారు. చైతన్యపురిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె సందడి చేశారు. 2024 సంవత్సరానికి నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మొదటి విడత స్కాలర్ షిప్‌గా రూ.12 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రతిక మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు అన్ని రంగాల్లో రాణించాలనే కోరిక ఉంటుందని, కానీ అవగాహన లేకపోవటం వల్ల ముందుకు రాలేక పోతున్నారని అన్నారు. నిఫ్డ్ లాంటి సంస్థలు స్కాలర్ షిప్‌లు అందజేసి అటువంటి వారిని ప్రోత్సహిస్తున్నందుకు చైర్మన్ కన్నెబోయిన గీత, డైరెక్టర్ రాము యాదవ్‌లను అభినందించారు. చైర్మన్, డైరెక్టర్ మాట్లాడుతూ , ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు స్కాలర్‌షిప్‌లు అందజేసి ప్రోత్సహిస్తున్నామని, అనంతరం ఉపాధి అవకాశాలు కలిపిస్తున్నామన్నారు. నిఫ్డ్ ఇన్‌చార్జ్ భవానీ, ఫ్యాకల్టీలు నందిని, మౌనిక, స్నేహ, సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో అత్యుత్తమ విద్యాబోధన: ఎమ్మెల్యే


వనస్థలిపురం హైస్కూల్‌లో విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు గల ఉపాధ్యాయులు ఉంటారని, ప్రైవేటు దీటుగా అత్యుత్తమ బోధన అందిస్తారని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆయా రంగాలలో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని ఆయన అన్నారు. బుధవారం వనస్థలిపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, స్కూలు యూనిఫామ్స్, తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ హీర్యానాయక్, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు చింతల రవి కుమార్, హెచ్ఎం దుర్గలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 47, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 60, కాకర 45, బీర 60, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 23, క్యారెట్ 40. దొండ 25.

చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. బుధవారం కొత్తపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాల విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని మంచి మార్కులు సాధించాలని సూచించారు. పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు మంచి రాజేష్, కొత్త తిరుమల్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే అహ్మద్ బలాల


అక్బర్‌బాగ్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: సర్కార్ బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మలక్‌పేట హైస్కూల్, నెహ్రూ మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. ఆ యన మాట్లాడుతూ.. చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సర్కార్ బడిలో సకల సదుపాయాలు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అక్బర్‌బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, సైదాబాద్ కార్పొరేటర్ అరుణా రవీందర్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ తిరునగరి రాధాకృష్ణ, యూసీడీ పీఓ యుగంధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మూసారాంబాగ్‌లో..

డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారం స్కూల్లో, సంజీవయ్యనగర్ బస్తీలోని బాగ్‌మూసారిమో ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి హాజరై విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందజేశారు. సైదాబాద్ డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ, హెచ్ఎంలు శశికళ, సుచరిత, ఆర్‌ఓ అండాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి


పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి


విద్యార్థులకు యూనిఫారాలు అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి విద్యార్థుల తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం ఆమె విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. సైదాబాద్ ఆర్యసమాజ్ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఆస్మాన్‌ఘడ్‌లోని అప్పర్ ప్రైమరీ స్కూల్,బి బ్లాక్స్‌లోని అంధ బాలికల పాఠశాల, శంకేశ్వరబజార్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సైదాబాద్ మండల డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ, అధికారులు తిరుపతిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లతారాణి, ఆస్రా, నర్సింహ పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడులకే వెళ్లాలి...

చంపాపేట: బడీడు పిల్లలు ఇతర పనులకు కాకుండా చదువుకొనేందుకు పాఠశాలలకే వెళ్లాలని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం చంపాపేట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మి, అజిత, వెంకటదేవి, జ్యోతి, రజిత, రాంరెడ్డి, కావ్య, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

లింగోజిగూడ: సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, టీచర్లు పాల్గొన్నారు.

బీఎన్‌రెడ్డి నగర్‌లో...

డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ పాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు అందజేశారు. ఎంఈఓ హిరియానాయక్, ప్రధానోపాధ్యాయులు దినేష్, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మురుగుకు కట్టడేదీ?


సీఎం రోడ్డులో డ్రైనేజీ నీరుతో నిండిపోయిన రోడ్డు


సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్ ప్రధాన రహదారిలో పొంగుతున్న మ్యాన్‌హోల్

- నిత్యం రోడ్లపై డ్రైనేజీ పరుగు
- భరింప రాని దుర్వాసన
- స్థానికులు, వాహనదారులకు అవస్థలు

లింగోజిగూడ: వర్షా కాలం వచ్చిందంటే చాలు లింగోజిగూడ డివిజన్‌లోని ప్రజలు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని బతకాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. జీహెచ్ఎంసీ పరిధిలోనే అత్యంత ముంపు ప్రాంతం లింగోజిగూడ. ముంపునకు అధికారుల నిర్లక్ష్యం కూడా తోడవుతుండటంతో వర్షాకాలంలో మరిన్ని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, ప్రధాన రహదారుల్లో నిత్యం డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్ ప్రధాన రహదారిలో, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ ప్రధాన రహదారిలో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగుతుండటంతో రోడ్లు మురుగు కాలువలను తలపిస్తున్నాయి.డ్రైనేజీ సమస్యలపై స్థానికులు ఫిర్యాదులు చేసినా జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్షా కాలం రాకముందే పరిస్థితి ఇలా ఉంటే...వర్షా కాలంలో పరిస్థితి మరింత ఇబ్బంది కరంగా మారే అవకాశం ఉందని, అధికారులు, సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాహనదారులు, స్థానికులకు ఇక్కట్లు

ప్రధాన రహదారుల్లో డ్రైనేజీ పొంగి పొర్లుతుండటంతో స్థానికులు, వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ దుర్వాసనతో స్థానిక దుకాణదారులు, అటుగా వెళ్లే పాదచారులు ముక్కు మూసుకొనివెళ్లాల్సి వస్తోంది.అటుగా వెళ్లే వాహదారులపై డ్రైనేజీ నీరు పడుతుండటంతో దుస్తులు పాడైపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

పూడికతీతపై నిర్లక్ష్యం..

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకోని డ్రైనేజీలో పూడికతీత పనులు చేపట్టి మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్‌కు తీసివేయాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఆ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే పూడిక తీత పనులు పూర్తికా వల్సి ఉండగా, ఇప్పటి వరకు 50శాతం పనులు కూడా జరగలేదని పలువురు ఆరోపిస్తున్నారు.వర్షాకాలంలో ముంపు ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపాదికన పనులు చేయాలని ప్రభుత్వం ఒక పక్క చెప్తుంటే.. ఇక్కడ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేదు..

జలమండలి అధికారులకు మామూళ్లపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సమస్యలపై ఫిర్యాదు చేస్తే మూడు నా లుగు రోజులు గడిస్తే కానీ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. అదికూడా తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేసున్నారని, కాంట్రాక్టర్లకు మేలు చేసే పనులు తప్ప ప్రజలకు మేలు జరిగే పనులు చేపట్టడం లేదని ప్రజలు అంటున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

అధికారుల నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు వస్తున్నాయి. డ్రైనేజీ పొంగి ఇబ్బంది వస్తోందని ఫిర్యాదు ఇచ్చిన రెండ్రోజులకు కూడా స్పందించడం లేదు.పూర్తి స్థాయిలో సమస్య పరిష్కరించకుండా కంటితుడుపుగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలి

– శివ, కర్మన్‌ఘాట్

హిందూ యాత్రికులపై దాడి పిరికి పందల చర్య


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

సైదాబాద్: ఉగ్రవాదులు హిందూ యాత్రికులపై దాడి చేయడం పిరికి పందల చర్య అని బజరంగ్‌దళ్ వివేకానంద దిల్‌సుఖ్‌నగర్ జిల్లా కన్వీనర్ ముద్దం మహేష్ యాదవ్ అన్నారు. జూన్ 9న పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు మాతా వైష్ణోదేవి కత్రా నుంచి శివ్‌ఖోడీకి వెళ్తున్న హిందూ యాత్రికుల బస్సుపై దాడి చేసి 10 మంది ప్రాణాలు తీశారని ఆయన తెలిపారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం సైదాబాద్ డివిజన్ శంకేశ్వరబజార్ చౌరస్తాలో ఆయన భజరంగ్‌దళ్ నాయకులు కార్యకర్తలో కలిసి ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పలువురు బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులను ప్రజలే రక్షించుకోవాలి

నాగోలు: దేశంలోని సహకార బ్యాంకులను ప్రజలే రక్షించుకోవాలని మాజీ ఆర్‌బీఐ అధికారి డాక్టర్ ఆర్.వైద్యనాథన్ అన్నారు. ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ హైదరాబాద్ జోన్ బ్యాంకు శాఖల సంప్రదింపుల కమిటీ సభ్యుల సదస్సు బుధవారం కొత్తపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యనాథన్ మాట్లాడుతూ, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు, పురోగతి, సహకార రంగంలో ఇంకా రావాల్సిన మార్పులు, వివిధ స్థాయిలో ప్రజలకు ఇచ్చే రుణాలు, ఇతర సహకార బ్యాంకుల పని విధానాన్ని వివరించారు.హైదరాబాద్ జోనల్ మేనేజర్ పి.ప్రసాద్ రావు, మల్టీ స్టేట్ విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు. బ్యాంక్ డైరెక్టర్ చలికాని కృష్ణమోహన్ రావు తదితరులు మాట్లాడారు. బ్యాంక్ డైరెక్టర్ ఆచల రామకృష్ణారావు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

వామపక్ష ఉద్యమ నాయకురాలికి నివాళి


కామ్రేడ్ రాధక్క భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సైదాబాద్: వామపక్ష ఉద్యమ నాయకురాలు కామ్రేడ్ రాధక్క (83) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని కుమార్తె నివాసంలోని ఆమె భౌతిక కాయానికి బుధవారం సీపీఎం నాయకులు నివాళులర్పించారు. విప్లవ పోరాటాల్లో ఆమె దశాబ్దాల తరబడి అవిశ్రాంతంగా పోరాడారని నాయకులు గుర్తు చేసుకున్నారు. రాధక్కకు నివాళులర్పించిన వారిలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, హైదరాబాద్ సౌత్ జిల్లా సీపీఎం నాయకులు నాగేశ్వర్, విఠల్, బాలు, శ్రవణ్‌కుమార్, మహేష్ ఉన్నారు.

చెత్తకుప్పలను తొలగించాలి

హస్తినాపురం: నాగార్జున సాగర్ రహదారికి ఆనుకుని ఉన్న పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయిందని, ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని సెంటర్ ఫర్ సోషియో కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సెక్రటరీ వి.సన్నిహెరాక్లియస్ ఆరోపించారు. ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని, కాలనీల్లో ప్లాస్టిక్‌ను డంపింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని మై జీహెచ్ఎంసీ యాప్‌లో ఎన్నో ఫిర్యాదులు చేశామని, వాటిని పరిష్కరించకుండా అధికారులు క్లోజ్ చేస్తున్నారని అన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సన్నీ డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


మృతి చెందిన కంద దొరైస్వామి

నాగోలు: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..నాగోలు నువ్వుల బండ కాలనీలోని శ్రీనివాస్ నివాసంలో కొంత కాలంగా కంద దొరైస్వామి(64) కిరాయికి ఉంటున్నాడు. అనారోగ్య కారణాలతో గత నెల 23న గాంధీ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతున్న స్వామి రెండు రోజుల క్రితం చనిపోయాడు. దీంతో ఆస్పత్రి సిబ్బంది నాగోలు పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడి పూర్తి వివరాలు తెలియరాలేదు. మృతుడి సంబంధీకులు ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తుక్కుగూడ-శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బస్సు సర్వీసు

నేడు ప్రారంభించనున్న ఆర్టీసీ

మహేశ్వరం: తుక్కుగూడ- శంషాబాద్ వయా ఎయిర్‌పోర్టు నుంచి రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపనున్నట్లు మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహేశ్వరం డిపో నుంచి తుక్కుగూడ నుంచి శంషాబాద్ వయా ఎయిర్‌పోర్టు వరకూ ప్రతి 45 నిమిషాలకు ఒక ట్రిప్పు నడుపుతారని తెలిపారు. ఈ సర్వీసు గురువారం నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నిత్యం శంషాబాద్, తుక్కుగూడ వెళ్లే వారికి ఈ బస్సు సర్వీసులు ఉపయోగపడుతాయని తెలిపారు.

'సెంట్రల్ లైటింగ్' ప్రారంభం

మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తా నుంచి బడంగ్‌పేట కమాన్ వరకు రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను బుధవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ప్రధాన రహదారుల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని, అందులో భాగంగానే బాలాపూర్ చౌరస్తా నుంచి నాదర్‌గుల్ వరకు రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నామన్నారు. త్వరలోనే మీర్‌పేట పెద్ద చెరువు, మంత్రాల చెరువుల వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పా టుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, మేయర్ దుర్గాదీప్‌లాల్‌చౌహాన్,డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి పాల్గొన్నారు.